క్లుప్తంగా

19న ఇంటర్వ్యూలు

కడప కార్పొరేషన్: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 19వ తేదీ కడప నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, కాపు, రెడ్డి, ఈడబ్ల్యుఎస్ కార్పొరేషన్లకు సంబంధించి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 19వ తేదీ ఉదయం 10 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, విద్యార్హత పత్రాలు ఒరిజినల్, రెండుసెట్లు జిరాక్స్ పత్రాలు తీసుకొని రావాలన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో హైదరాబాద్‌లోని ప్రథమ నర్సింగ్ ఎలక్ట్రికల్ శిక్షణా కేంద్రాలలో రెండు నెలలపాటు అసిస్టెంట్ నర్సింగ్ అండ్ సోలార్ ఎలక్ట్రికల్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ సెంటర్ ప్రతినిధి పరమేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (ఫిమేల్), అసిస్టెంట్ సోలార్ ఎలక్ట్రిషియన్‌గా శిక్షణకు 18–30 సంవత్సరాల మధ్య గల వయస్సుగల అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా లేదా ఏదైనా ఒకేషనల్ కోర్సు చదివి ఉండాలన్నారు. అభ్యర్థులు ఆధార్, పదవ తరగతి మార్కుల జాబితా, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈనెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, స్టడీ మెటీరియల్, జత యూనిఫాం అందజేస్తామన్నారు. వివరాలకు 81425 90754 సంప్రదించాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 27 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అర్జీలు– 9, టౌన్ ప్లానింగ్– 6, రెవెన్యూ విభాగం– 5, పబ్లిక్ హెల్త్– 5, యూపీఏ విభాగం, హౌసింగ్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ వచ్చాయి. ఈ అర్జీలను సమగ్రంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ విభాగాధిపతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్‌గా లలిత



డా. లలితకు నియామక పత్రాన్ని అందచేస్తున్న వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. లలితను స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈ మేరకు వైవీయూ వైస్ చాన్సులర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మలు డా.లలితకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 3వ శనివారం వైవీయూలో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం కార్యక్రమ అమలును పర్యవేక్షించడం, నివేదించడం వంటి బాధ్యతలను చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ శాఖ సహ ఆచార్యులు డా.వెంకట్రామ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు



అన్నదానం చేస్తున్న తాహీర్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన జన వికాస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ఎండీ తాహీర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలో సోమవారం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బృహద బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం, నిరాశ్రయుల, అనాథ పిల్లల వసతి గృహాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే రిమ్స్ ఆస్పత్రిలో మానసిక రోగులు, కేన్సర్, టీబీ బాధితులు, బాలింతలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేన్సర్ బాధితుడికి నగర మైనార్టీ ప్రముఖులు మన్సూర్ అలీఖాన్ రూ. 20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు రమణ, డాక్టర్ శ్రీనివాసులు, నూనె నగేష్, నాసిర్ అలీ, రాహుల్ ప్రకాశ్, అబ్దుల్ వాజిద్, ఖాదర్‌బాషా, షేక్ మస్తాన్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

■ చెట్ల మీద సేదదీరుతూ..



కొంగలన్నీ వేకువజామునే గూళ్ల నుంచి రివ్వున ఎగిరి వచ్చాయి. ఆహార వేటలో నిమగ్నమై .. కాలువలు.. చెరువుల వద్దకు చేరాయి. కడుపారా తిని.. ఇలా చెట్లమీద సేదదీరాయి. కడప నగర సమీపంలోని పాలెంపల్లె వద్ద సోమవారం కనిపించిన దృశ్యమిది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఉపాధి పనులు కాంట్రాక్టర్లకు అప్పగించకండి

– జేసీకి ఎంపీపీల వినతి



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీపీలు

కడప సెవెన్‌రోడ్స్ : ఉపాధి హామీ పనులలో 50 శాతం ఖచ్చితంగా కూలీలతోనే చేయించాలని, ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలతో చేయడం, ప్రైవేటు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం వంటివి జరగరాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వీఎన్ పల్లె మండల పరిషత్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బాలయ్య, చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డిలు సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు విన్నవించారు. ఉపాధి పనులు కాంట్రాక్టర్లకు ఇవ్వరాదన్న హైకోర్టు ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని కోరారు. గ్రామసభ ఆమోదించిన పనులు మాత్రమే చేయాలన్నారు. అలా కాకుండా వాటిని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి పనులను గ్రామసభ తీర్మానాలతో, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో నిమిత్తం లేకుండా ఇష్టారాజ్యంగా కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా ఉపాధి హామీ చట్ట ఉల్లంఘన కిందికి వస్తుందని, ప్రైవేటు కాంట్రాక్టర్లకు కేటాయించిన పనులను వెంటనే రద్దు చేయాలంటూ తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టం అమలులో ప్రధానపాత్ర పోషిస్తున్న డ్వామా పీడీ, జెడ్పీ సీఈఓ, ఎంపీడీఓలు, పీఓ, ఏపీఓ, ఇతర అధికారులు జరుగుతున్న అవకతవకలకు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?

– వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల కాలంలో బీసీలను అన్ని రకాలుగా నయవంచనకు గురిచేసిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్ విమర్శించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా పథకాల ద్వారా పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు బీసీలకు 50 సంవత్సరాలకే పింఛను, ఆదరణ పథకం పునరుద్ధరణ, బీసీలకు రక్షణ చట్టం, బీసీలకు ఆర్థిక చేయూత వంటి పథకాలు అమలు చేస్తామని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఎనిమిది నెలలు గడుస్తున్న వాటి అమలు చేయక పోగా గత ప్రభుత్వంలో బీసీలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు రద్దు చేసి బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో బీసీలకు అగ్రతాంబూలం వేసి యాభై ఆరు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్, డైరెక్టర్ పదవులిచ్చి బీసీలను రాజ్యాధికారానికి దగ్గర చేశారని తెలిపారు. నామినేటెడ్ పదవులతో పాటు నామినేటెడ్ పనుల్లో 50 శాతం కేటాయించి బీసీల ఆర్థిక చేయూతకు తోడ్పడ్డారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ ఛైర్మన్ వాటిలో జనరల్ స్థానాలను కూడా బీసీలకు కేటాయించి దేశ రాజకీయ చరిత్రలో, బీసీల గుండెల్లో అభినవ పూలేగా జగనన్న నిలిచిపోయారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైఎస్ఆర్‌సీపీ బీసీ నేతల మీద భౌతిక దాడులు, హత్యా ప్రయత్నాలకు, అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. బీసీలను అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు మాజీ సర్పంచ్ ఆదిమూలం శివయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కర్పూరి ఠాగూర్ వర్ధంతి



కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జన నాయక్ జిల్లా శాఖ ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ / కడప రూరల్: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కర్పూరి ఠాగూర్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం జన నాయక్ కర్పూరి ఠాకూర్ ఫౌండేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బీసీ భవన్‌లో నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డీపీ వెంకట రమణ, ఎం.శ్రీనివాసులు తదితరులు కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఠాగూర్ జీవితాన్ని తెలుసుకుని ఆయన చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. బీహార్‌లో అతి సామాన్య నాయీ బ్రాహ్మణ కుటుంబంలో ఆయన జన్మించారన్నారు. విద్యార్థి దశలోనే సామాజిక స్పృహను పెంచుకున్న ఠాగూర్ పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి పలుమార్లు జైలు జీవితాన్ని గడిపారని తెలిపారు. 1952 ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ నాయకుడిగా అసెంబ్లీలోకి ప్రవేశించారన్నారు. 35 ఏళ్లపాటు ఓటమి ఎరుగని నాయకుడిగా గుర్తింపు పొంది మంత్రివర్గంతోపాటు రెండుసార్లు ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారని వివరించారు. ఆయన చాలా నిరాడంబర జీవితాన్ని గడిపారని, మరణించేనాటికి సరైన ఇల్లు కూడా లేదన్నారు. ఆయన బ్యాంకు ఖాతాలో రూ. 500 మాత్రమే ఉండేదన్నారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే బీసీలకు రిజర్వేషన్ వసతి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు కుమార్, బీసీ నాయకులు అవ్వారు మల్లికార్జున, పీవీ రమణ, నబీకోట శ్రీనివాసులు, మునిస్వామి, ద్వారక మునిస్వామి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 26 వేలు వేతనం ఇవ్వాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రామ్మోహన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని రూరల్, అర్బన్ సీడీపీఓ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. గతంలో 42 రోజులు సమ్మె చేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు గ్రాట్యూటీ అమలు కాలేదని, గ్యాస్ ఇచ్చేపరిస్థితి కూడా లేదని తెలిపారు. ఒకవైపు రాజకీయ వేధింపులతో వర్కర్లు సతమతమవుతున్నారని, పదోన్నతులు రాక యాప్‌ల పేరుతో వర్కర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలతోపాటు సీఐటీయూ నాయకులు ఉదయ్, రవి, నాగలక్ష్మి, వినీల, వసుంధర, యశోద తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూప్‌ల మధ్య వాగ్వివాదం

కడప అర్బన్: కడప నగరంలోని మెప్మా కార్యాలయం సమీపంలో డ్వాక్రా గ్రూప్ మహిళల మధ్య సోమవారం వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ విషయంపై కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌కు మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అక్కడి నుంచి పోలీసులు కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లమని చెప్పడంతో అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు.

కామన్ పీజీ సెట్ విధానాన్ని రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కామన్ పీజీ సెట్ విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివ శంకర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పీజీ సెట్ నిర్వహణ గురించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోక పోవడం విద్యార్థుల్ని మోసం చేయడమే అన్నారు. 2021 సంవత్సరం ముందు పీజీ సెట్ల నిర్వహణ ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ పీజీ ప్రవేశాలు నిర్వహించే వారన్నారు. 2024 ఎన్నికల హామీలలో భాగంగా నారా లోకేష్ ఉమ్మడి పీజీ అడ్మిషన్లు రద్దుచేసి ఏ యూనివర్సిటీ ఆ యూనివర్సిటీ ప్రవేశాలు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఆనాడు విద్యార్థులకు హామీ ఇచ్చారని తెలిపారు. ఇటీవల ఉన్నత విద్యామండలి విడుదల చేసిన వివిధ కోర్సులకు సంబంధించిన ప్రవేశాల నోటిఫికేషన్ లో పీజీ సెట్ పాత పద్ధతిలో ఉమ్మడిగానే ఉందని ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ పీజీ సెట్ నిర్వహించుకోవడానికి అవకాశం లేదని తెలిపారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడే విధంగా ఏ యూనివర్సిటీ ఆ యూనివర్సిటీ ప్రవేశాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పాఠశాలలను తరలించే విధానాన్ని మానుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కొన్ని ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం తరలించే కార్యక్రమానికి పూనుకుందని ఈ కార్యక్రమాన్ని తక్షణం మానుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. ఇందులో భాగంగా పోరుమామిళ్ల మండలంలోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులను కొత్రపాటిపల్లి గ్రామానికి తరలించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను మానుకోవాలని కోరుతూ సోమవారం కడపలోని డీఈఓ ఆఫీస్ ఏడీ మునీర్ ఖాన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా పాఠశాలలు సొంత ఊరులోనే ఉంటూ ఎంతోమంది విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించి పై చదువుల కోసం వెళ్లడం జరుగుతుందన్నారు. కాగా ఈ మధ్యకాలంలో జీ.ఓ నెంబర్ 117 విధానాన్ని దొడ్డి దోవ పట్టించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. జిల్లాలోని ఎనిమిది ప్రాథమిక పాఠశాలలను తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు జాలా సుమంత్, నగర నాయకులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

■ ట్రాఫిక్ కష్టాలు



కడప నగరంలో సోమవారం ఓల్డ్ రిమ్స్ నుంచి క్రిస్టియన్ లైన్ మార్గంలో ట్రాఫిక్ ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మునిసిపల్ పారిశుధ్య కార్మికులు రోడ్డు పై చెత్త తరలించే భారీ వాహనం ఉంచి పారిశుధ్య చర్యలు చేపడుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిబంధనల ప్రకారం రాత్రి పూట చెత్తను క్లీన్ చేసి వేకువ జామున చెత్త ను తొలగిస్తారు. అలా కాకుండా వాహనాలు రద్దీ ఉన్న క్రమంలోనే రోడ్డు పైనే చెత్త వాహనాన్ని నిలిపి ప్రవేటు ఆసుపత్రుల బయో వేస్ట్ తొలిగిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప**

వ్యక్తి అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లాకు చెందిన ఎస్.ఆనంద్ అనే వ్యక్తిని సెల్‌ఫోన్ దొంగతనం కేసులో అరెస్టు చేసినట్లు రైల్వే సీఐలు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆనంద్ నుంచి 67 గ్రాముల బంగారం, సెల్‌ఫోన్ రికవరీ చేశామన్నారు. గుంతకల్లు కోర్టులో సోమవారం హాజరు పరచగా నిందితుడిని రిమాండుకు తరలించారన్నారు.

హెల్మెట్ ధరించండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనాలను నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని జిల్లా ఎస్పీ ఈ జీ అశోక్‌కుమార్ సూచించారు. సోమవారం రాయల్ రషీద్ అసోసియేషన్ తయారు చేసిన హెల్మెట్ ధరించండి అనే పోస్టర్లను జిల్లా ఎస్పీ ఆయన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంతో ప్రమాదాల నుంచి సేఫ్‌లో ఉండవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయం అని రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లాను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ డీకే జావీద్ పాల్గొన్నారు.

కళా ప్రతిభకు డాక్టరేట్

కడప కల్చరల్ : కడపకు చెందిన ఏవీఎస్ రాజు ప్రతిభను గుర్తించిన ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్శిటీ ఇటీవల విశాఖపట్టణంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం అభినందనీయమని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం వైఎస్సార్ రచయితల సంఘం ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో ఏవీఎస్‌రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మూల మాట్లాడుతూ రాజుకు బాల్యం నుంచి కళల పట్ల ఎంతో మక్కువ ఉండేదని, ఆయన క్రమంగా వాటిని అభివృద్ధి చేసుకుని.. రంగస్థలంపై రాణించారన్నారు. ఆయన ప్రజ్ఞను గుర్తించి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, మురళి, గంగయ్య, బాల ఓబయ్య, శ్రీనివాసరాజు, ఎం.వెంకటసుబ్బయ్య, కిరణ్‌కుమార్, నరసింహారెడ్డి, ఓబులేశు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జయంతి నిర్వహణకు వినతి

కడప కల్చరల్ : తొలి తెలుగు రామాయణ రచయిత్రి మొల్లమాంబ జయంతి ఉత్సవాన్ని యోగి వేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించాలని మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కోరారు. సోమవారం యూనివర్శిటీలో ఆయన ఉప కులపతి ఆచార్య కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. అందుకు వీసీ సమ్మతిస్తూ మార్చి 11 లేక 12వ తేదీలలో ఆమె జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తామని తెలిపారు.

రాయల్ కాపునాడు అధ్యక్షుడిగా సుబ్బరాయుడు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని కాపు, బలిజ, ఒంటరి కులాల ఐక్య సంఘటన అధ్యక్షుడిగా కడియాల సుబ్బరాయుడిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా కులాలవారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందేలా పార్లమెంటు, అసెంబ్లీ, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని, వారి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

శాస్త్రీయంగా ఆలోచించాలి

కడప ఎడ్యుకేషన్: నిత్య జీవితంలో ప్రతి మనిషి శాస్త్రీయంగా ఆలోచించాలని డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ప్రముఖ కవి, సాహితీ స్రవంతి నాయకులు పిళ్లా విజయ కుమార స్వామిరెడ్డిలు అన్నారు. సోమవారం స్థానిక ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ తత్వవేత్త ఖగోళ శాస్త్రజ్ఞుడు బ్రూనో వర్ధంతిని పురస్కరించుకొని సత్యాన్వేషణ దినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ సత్యాన్వేషణ శాస్త్రీయ దృక్పథం మీద ఆధారపడి జరగాలన్నారు. మన నిత్యజీవితంలో ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా ఆలోచించడం ద్వారా మనం సరైన నిర్ణయాన్ని సరైన మార్గాన్ని పాటించడానికి వీలవుతుందని అన్నారు. జనవిజ్ఞాన వేదిక నాయకురాలు అరుణ , జనవిజ్ఞాన వేదిక నాయకులు వెంకటేశ్వర్లు, గోపాల్, సునీత, శివరాం, రియాజ్, కళాశాల అధ్యాపకులు శిల్ప, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ సొమ్మును లెక్కిస్తున్న అధికారులు, అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీ సొమ్మును లెక్కించారు. దేవదాయ ధర్మదాయశాఖ పక్షాన పాలనాధికారి ఎ.శ్రీధర్, సూపరింటెండెంట్ రమణమ్మ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. గత నవంబరు 27 నుంచి ఇప్పటివరకు రూ. 63,917 చేకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎన్.సతీష్ శశిధర్, ఎన్.దక్షిణామూర్తి. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పథకాలను వివరిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు మహిళలకు అనేక పథకాలను అమలు చేస్తోందని, ఆయా పథకాలను వారు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు పిలుపునిచ్చారు. కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ ఆదేశాల మేరకు సోమవారం కడప నగరంలోని ఆరు బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనరా ఏంజెల్ అకౌంట్స్ సేవింగ్స్ ఖాతాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయ ప్రతినిధి వెంకట ప్రసన్న, శివలత, విలియం కుమార్, ఆర్వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



ఆల్ మేవా నాయకులతో కలిసి డైరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఆల్ మేవా 2025 డైరీని ఆల్ మేవా జిల్లా అధ్యక్షుడు పీ.ఎం జలీల్ ఖాన్ ఆధ్వర్యంలో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఆల్ మేవా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ యస్.ఎ.యస్ ఫరూక్‌ల చేతుల మీదుగా ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లయన్ మన్సూర్ అలీ ఖాన్, కార్పొరేటర్ జఫ్రుల్ల, ఆల్ మేవా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి.సన్నావుల్లా, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నజీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

డెస్కులు వితరణ



డెస్కులను ప్రారంభిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థి పీఏఎస్ మూర్తి

కడప ఎడ్యుకేషన్: కడప నగరం 20వ వార్డు గాండ్ల వీధికి చెందిన నగరపాలక ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) కడప బ్రాంచ్ వారు సీఎస్ఆర్ స్కీం కింద రూ. లక్షా 50 వేలు విలువ చేసే డెస్కులు వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి దిద్దకుంట గంగిరెడ్డి మాట్లాడుతూ బ్యాంకు వారు అందించే ఇలాంటి స్కీం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ వాసుకుమార్, పాఠశాల పూర్వ విద్యార్థులు పీఏఎస్ మూర్తి, మస్తానయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్‌బేగం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి న్యాయ ప్రచారంలో 6897 గృహాల సందర్శన



వివరాలను సేకరిస్తున్న అధికారుల బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటింటి న్యాయప్రచారంలో భాగంగా 6897 గృహాలను సందర్శించి 83 మంది ఎదుగుదల లోపాలుగల పిల్లలను గుర్తించామని అధికారుల బృందం తెలియజేసింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తింపు కోసం ఇంటింటి న్యాయ ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగర్ వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.